క్లుప్తంగా

చక్రాపూర్‌లో వనభోజనాలు



అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామస్తులు ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయమే గ్రామస్తులందరూ వంట సామగ్రిని తీసుకుని ఇళ్లకు తాళాలు వేసి ఊరు విడిచి పొలాల వద్దకు వెళ్లారు. చెట్ల కిందనే వంటలు చేసి అక్కడే భోజనాలు చేశారు. చెట్ల కిందనే కుటుంబ సభ్యులంతా సేద తీరారు. గ్రామంలోకి ఎవరూ వెళ్లకుండా గ్రామ సేవకులు పహారా కాశారు. సాయంత్రం తర్వాత గ్రామస్తులు పొలాల నుంచి ఇళ్లకు చేరుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలజారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు



నవాబుపేట: మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం మండలంలోని మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా బోనాలు, కోడి మొక్కులు చెల్లించుకున్నారు.

సగర సంఘం అధ్యక్షుడిగా రాఘవులు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సగర సంఘం భవనం వద్ద ఆదివారం సగర సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా బీసం రాఘవులు, ఉపాధ్యక్షుడిగా కేఆర్ లోకేందర్, ప్రధాన కార్యదర్శిగా గోవిందుగారి సాగర్, కార్యదర్శిగా కె.కొండలు, కోశాధికారిగా డీఆర్ వెంకటేశ్వర్లు, సలహాదారులుగా ఆంజనేయులు, కృష్ణయ్య, కె.ఆంజనేయులు, కృష్ణయ్య, నర్సింహులను ఎంపిక చేశారు.

జడ్చర్లలో వైద్యశిబిరం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్‌ప్రైమ్ ఆస్పత్రిలో ఆదివారం ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈఎన్‌టీ సర్జన్ డా.డిపిన్‌కుమార్ 100మంది రోగులకు ఉచిత కన్సల్టేషన్ చేసి అవసరమైన ప్రొపీజర్స్ చేసినట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ అంకిత్ తెలిపారు. చెవి సంబంధ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

డ్రమ్ముల పంపిణీ



గండీడ్: మండలంలోని వెన్నాచెడ్‌లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంపెనీ ప్రతినిధులు డ్రమ్ములను పంపిణీ చేశారు. వచ్చే నీటిని వృథా చేయకుండా నీటి నిల్వ కోసం పంపిణీ చేసే డ్రమ్ముల్లో నీటిని నిల్వ చేసుకుని వినియోగించుకోవాలని ఐసీఐసీఐ డీఓ విశాల, సీఎఫ్ శివ ఫౌండేషన్ ట్రైనర్ చల్లా వీరేంద్ర సూచించారు.

ఇంటింటి ప్రచారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో రెండోరోజు ఆదివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం కొనసాగింది. శేషాద్రినగర్, అయోధ్యనగర్, ఎస్‌ఆర్ కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, క్రిస్టియన్‌పల్లిలో పార్టీ పార్లమెంటరీ పరిశీలకుడు మెట్టుకాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి గతంలో తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఆయా వార్డు కమిటీ అధ్యక్షులు పిల్లి శ్రీహరి, లక్ష్మయ్య, శేఖర్, చెన్నయ్య, శ్రీఖర్‌రెడ్డి, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటయ్య

కోయిల్‌కొండ: ముదిరాజ్ సంఘం మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా ఇరారాం వెంకట్రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ ముదిరాజ్ సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, నారాయణ, మడుగు వెంకటయ్య, వేణు, మొగులయ్య, వీరన్న, చిన్న, కొండయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మెటీరియల్

- యథేచ్ఛగా ఇసుక, కంకర, ఇటుకలు వేస్తున్న వైనం
- పాదచారులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం
- స్థానికులకు తప్పని ఇబ్బందులు



మర్లులోని విఘ్నేశ్వరకాలనీలో రోడ్డుపైనే వేసిన ఇసుక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. వీటికి అవసరమయ్యే ఇసుక, కంకర, సీకులు, సిమెంట్, కర్రలు తదితర సామగ్రిని యజమానులు ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. గల్లీల్లో రోడ్డుపైనే వీటిని అడ్డంగా కుప్పలుగా వేస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుమారు పదేళ్ల కిందట మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పది గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. వీటిలో ఎనుగొండ, ఎదిర, అప్పన్నపల్లి, బండమీదిపల్లి, చిన్నదర్‌పల్లి, బోయపల్లి, దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, క్రిస్టియన్‌పల్లి, పాలకొండ ఉన్నాయి. కాగా, కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. తొమ్మిదేళ్లుగా అదేస్థాయిలో విస్తరిస్తోంది. జిల్లా కేంద్రానికి నలువైపులా విశాలమైన రోడ్లు, బైపాస్ విస్తరించడంతో పాటు హైవే ఉండటంతో రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. ఈ క్రమంలోనే చుట్టుపక్కల గ్రామాల వారు ఇక్కడికే వచ్చి స్థిరపడుతున్నారు. వివిధ పనులు వేరే చోట నిర్వహిస్తున్నా మహబూబ్‌నగర్ పట్టణంలోనే నివాసం ఉంటున్నారు. అందుకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంది. ముఖ్యంగా హైదరాబాద్ మార్గం వైపు హౌసింగ్ బోర్డు కాలనీ, ఎస్‌వీఎస్ ఆస్పత్రి సమీపంలో నుంచి బైపాస్, భూత్పూర్ మార్గంలో కొత్త కలెక్టరేట్ ఏర్పాటు కావడంతో కొత్త ఇళ్ల నిర్మాణం వేగవంతమైంది. అయితే వీటికి అవసరమయ్యే సామగ్రిని మాత్రం రోడ్లపై ఎక్కడబడితే అక్కడ కుప్పలుగా వేయడంతో నడవడానికి సైతం వీలుకావడం లేదు. తమను ఎవరు అడుగుతారులే.. అనే ధీమాలో కొందరు యజమానులు ఇలా వ్యవహరిస్తున్నారు. మొత్తం అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం..

నిబంధనల ప్రకారం వీధుల్లో రోడ్లపై ఎవరూ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ నిల్వ చేయకూడదు. క్షేత్రస్థాయిలోకి సిబ్బందిని పంపి ఎక్కడైనా రోడ్లపై ఇసుక, కంకర, ఇటుకలు, సీకులు కనిపిస్తే తొలగింపజేస్తాం. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం.
– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్



రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ వీధిలో రోడ్డుపైనే పోసిన కంకర, ఇటుక



హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ వీధిలో నిల్వ చేసిన ఇసుక



వడ్డెరబస్తీలో రోడ్డుపైనే వేసిన ఇసుక కుప్పలు, ఇతర వస్తువులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న ముడా చైర్మన్ గంజి వెంకన్న

పాలమూరు: సీనియర్ సిటిజన్ ఫోరం తరుపున చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ముడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పారిశ్రామిక వాడలో గల ఫోరం కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న గత కొన్ని రోజుల నుంచి సీనియర్ సిటిజన్ ఫోరం నుంచి అన్నదానం, దుప్పట్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, రోగులకు సేవలు లాంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా భావంతో మెలిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో నారాయణరావు, బాలయ్య, ఎ.రాజసింహుడు, బాలకృష్ణ, వినోద్‌కుమార్, అశోక్, సిద్దిరామప్ప, జయరాం పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేయూత



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రాంపూర్‌కు చెందిన తమ స్నేహితురాలు గీత భర్త రవి అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులంతా కలిసి వైద్యఖర్చుల కోసం రూ.40వేలు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సువర్ణ, సుస్మిత, రాఘవేందర్ చారీ, రామస్వామి, వేణుచారీ, రఘువీర్ యాదవ్, ఆనంద్, బాలకృష్ణ, తిరుపతి, రాము, హరినాథ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

- పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన అశోక్‌రెడ్డి కార్యకర్తలతో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా తీర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి రాజ్‌కుమార్, నాయకులు భిక్షపతి, లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ ఈశ్వర్, సర్పంచ్ రాజేశ్వర్, ఎంపీటీసీ చెన్నయ్య, హసీబొద్దీన్, గోపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన జంగం మైబు ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన నేపథ్యంలో ఆదివారం బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పరామర్శించారు. మృతుడి భార్య, వార్డు సభ్యురాలు జంగం మన్నెమ్మను ఓదార్చి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్, కృష్ణయ్య, రమేష్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మండలంలోని కాటవరానికికి చెందిన ఎలుసరి శోభన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఫోన్‌లో పరామర్శించి స్థానిక నాయకుల ద్వారా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీఅహ్మద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవుల బాలరాజు, నాయకులు ఆంజనేయులు, బాలయ్య, నిరంజన్, ప్రేమ్, మోహన్, జగదీశ్, రామకృష్ణ, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆదిబసవేశ్వర స్వామి ఉత్సవాలు

- నేటి నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి



పల్లెగడ్డ సమీపంలో వెలసిన ఆదిబసవేశ్వరుడు

నవాబుపేట: మండల ప్రజల ఆదిదేవుడిగా స్వయంభూగా వెలసిన ఆది బసవేశ్వరస్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో పల్లెగడ్డ గ్రామ శివారులో స్వయంభుగా వెలియటంతో ఆది బసవేశ్వరుడిగా పిలవబడుతాడు.

ఆలయ చరిత్ర..

పూర్వం ఒక రైతు పొలం దున్నుతున్న తరుణంలో గుంటుక పలుగుకు రాయి తగిలింది. రైతు రాయి అడ్డు తొలగించి పొలం గట్టున వేయగా, మరుసటి రోజు ఆ రాయి తిరిగి యథాస్థానంలోకి వచ్చింది. ఈ విషయాన్ని రైతు గ్రామస్తులకు తెలిపాడు. గ్రామస్తులు సైతం రాయిని తొలగించి పొలం గట్టున వేయగా, తిరిగి మరుసటి రోజు యథాస్థానంలోకి రాయి రావడంతో గ్రామస్తులు మహిమ ఉందని గ్రహించి పూజలు చేసినట్లు కథనం. కాలక్రమేనా ఆ రాయి నంది ఆకారంలోకి మారటం, పైగా ప్రతి ఏటా విగ్రహం పెరుగుతుండడంతో మహిమ గల దేవుడని ఆది బసవేశ్వరుడిగా ఇక్కడ పూజలు చేస్తున్నారు. ఆలయంలో మరో ప్రత్యేకత ఉంది. శివలింగంతో పాటే నంది ఉండటం విశేషం.

ఉత్సవాల వివరాలు..

ప్రతియేటా ఉత్సవాలు హోలీకి ముందు రోజు ప్రారంభమవుతాయి. 6న ఉత్సవాలు ప్రారంభమై 10వ తేదీన ముగుస్తాయి. 6న ప్రభోత్సవం, 7న రథోత్సవం, 8న శకటోత్సవం, 9న అగ్నిగుండం, 10న శివపార్వతుల కల్యాణంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ పూజారి శ్రీశైలం, కార్యక్రమ నిర్వాహకులు జంగయ్య, రాజలింగం తెలిపారు.

అర్చకులకు అవార్డులు



అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అర్చకులు మఠం సర్వేశ్వర్‌శర్మ, శివశ్రీ అరుణ్‌కుమార్‌లు అవార్డులను అందుకున్నారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్‌కు చెందిన సేవా సంస్కృతిక సంస్థ సర్ సీవీ రామన్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేశ్వర్‌శర్మను సువర్ణ కంకణ వైదిక ధర్మాచరణ విభూషన్ రత్న, అరుణ్‌కుమార్‌కు సువర్ణ కంకణ వైదిక ధర్మాచరణ విభూషణ ప్రపూర్ణ అవార్డులను ప్రకటించింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

నేడు వైద్యశిబిరం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో ఉదయం 9:30గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి బాల్‌కిషన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాజమాన్యాల వేధింపులు సరికాదు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కళాశాలలైన శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో ర్యాంకులు సాధించాలని, ఫీజులు కట్టాలని వేధించడం కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. యాజమాన్యాల వేధింపులకు గురై ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. సాత్విక్ లాంటి విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి సీతారాం, జిల్లా సహాయ కార్యదర్శి మధు, సంజీవ్, జిల్లా కోశాధికారి శివకుమార్, పీయూ నాయకులు తిరుమలేశ్, శ్రీకాంత్, నరేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేదల కష్టాలను తీరుస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 12, 26వ వార్డుల్లో ఆదివారం హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కొత్వాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించడానికి హాత్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌సిలిండర్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ.400 గ్యాస్ ధర ఉంటే ఇప్పుడు రూ.1150కి చేరిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణ మాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, జహీర్, అఖ్తర్, వసంత, సీజే బెనహర్, బెక్కరి మధుసూదన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



జూలపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే చేపట్టిన అభివృద్ధే ఉందని, కొత్తగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర గడప గడప కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని జూలపల్లిలో చేపట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన తండాల్లో ప్రజల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక తెలంగాణను ఇచ్చిన కాంగ్రెస్‌ను మోసం చేసిన కేసీఆర్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేదుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, నాయకులు రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి చేరికలు..

మండలంలోని జూలపల్లిలో మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి దాదాపు 50మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. రిటైర్డ్ వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న పరుశరాములు

కల్వకుర్తిరూరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే చర్యలో భాగంగా మార్చి 14న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పరుశరాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని యూపీఎస్ భవనంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాశన్న, హనుమంతు, జగన్, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటా

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని గిరిజనులు, గిరిజన సంఘాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించి వారికి అండగా నిలుస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని ఎల్లికల్‌తండాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు దేవాలయ అభివృద్ధితో పాటు తండావాసులకు తాగునీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. స్వచ్ఛత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధి అందరికీ అందాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. తండా యువకులు గ్రామ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్మద, నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ బిచ్చానాయక్, కిష్టానాయక్, చంద్రు, శివకృష్ణ, శ్రీపతిరాజు, కిషన్ తదతరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ప్రచారం

మరికల్: మండల కేంద్రంలోని ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే ఏకైక సంఘం పీఆర్‌టీయూ అన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ప్రతి ఉపాధ్యాయునికి న్యాయం చేసే బాధ్యత తమదేనన్నారు. సీపీఎస్ రద్దు విషయాన్ని కూడా రాష్ట్ర నాయకులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, అనిల్ కుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

